# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


సంచిక : 374 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 5-3-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

## నేటినుంచి ఇంటర్ పరీక్షలు

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు
- మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- సిసి కెమరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ
- నిమిషం నిబంధన ఎత్తివేత..5 నిముషాల వరకు అనుమతి

హైదరాబాద్,మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): : తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి,

-మిగతా 2 లో



## పులి పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ

వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని

జామ్‌నగర్,మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు ,

-మిగతా 2 లో



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం

విచారణ 25కు వాయిదా

న్యూఢిల్లీ,మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు

-మిగతా 2 లో



## పెండింగ్ నిధులివ్వండి

- సీఎం ఆర్ డెలివరీ గడువు పొడిగించాలి
- కొత్త రేషన్ కార్డులు సన్న బియ్యం పైన చర్చ
- రెండురోజులుగా ఢిల్లీలోనే సీఎం, మిగిలిన మంత్రులు
- మిల్లింగ్ గడువు పెంచండి
- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి

న్యూఢిల్లీ (నీలగిరి ఎక్స్ ప్రెస్): ఎఫ్‌సీఐ 2014-15 ఖరీఫ్ కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పడిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి

-మిగతా 2 లో



## శాసనసభకు కేసీఆర్ రాకపోవడంపై పిల్

పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు

హైదరాబాద్‌మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరు కావడంపై పిల్ దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. శాసనసభ పరిధిలోని

-మిగతా 2 లో

## రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం

- ప్రైవేట్ ఆస్పత్రులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలు
- బలవంతంగా మందులు అంటగడుతున్న ఆస్పత్రులు

న్యూఢిల్లీ,మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే.. ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రోత్సాహకంగా మారిందని విమర్శించింది. ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో మందులు కొనుగోలు

-మిగతా 2 లో



## బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం



- ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం
- నమ్మి ఓటేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి
- కార్మికుల ఆవేదన, ఆర్థనాదాలు వినిపించడం లేదా
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు

-మిగతా 2 లో



## ఉక్రెయిన్ మిలటరీ సాయానికి ట్రంప్ బ్రేక్

జెలెన్‌స్కీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం చోటు

వాషింగ్టన్ మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న అన్ని రకాల మిలటరీ సాయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిలిపివేశారు. గత వారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. కాగా దీనిపై ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం వెంటనే స్పందించలేదు. ”కేవలం శాంతిపైనే దృష్టి కేంద్రీకరించినట్టు అధ్యక్షుడు

-మిగతా 2 లో



## పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

- ఆదాయం రాని పీపీపీ ప్రాజెక్టులపై సమీక్షించండి
- ముందస్తు బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్‌మార్చి4(నీలగిరి ఎక్స్ ప్రెస్): రాష్ట్రంలో పర్యటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి 2025- 26 వార్షిక సంవత్సరానికి సంబంధిం చిన ఎక్సైజ్, టూరిజం, కల్చర్, ఆర్కియాలజీ

-మిగతా 2 లో

# పెండింగ్ నిధులివ్వండి

(మొదటి తరువాయి)

రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి.

# బకాయిలు చెల్లించండి

(మొదటి తరువాయి)

మంగళవారం కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బకాయిలు పెట్టి పదేండ్ల యిందని, వాటిని వెంటనే విడుదల చేయాల ని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని, అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఏ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును నెలా నెలా కాకుండా కనీసం నాలుగు నెలలు పొడిగించాలని, అప్పుడే సరఫరాలో ఎటువం టి ఇబ్బందులు తలెత్తవని తెలియజేశారు.

**4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులు పునరుద్ధరించండి : సీఎం**

తెలంగాణ రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దానిని వెయ్యి మెగావాట్లకు కుదించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో మహిళా సంఘాలతో సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. వారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

(మొదటి తరువాయి)

పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్థనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా వేలాది మంది ఉపాధిని పట్టించుకోకుండా, స్థానికుల మనోభావాలను లెక్కచేయకుండా పరిశ్రమను కేంద్రం ప్రభుత్వం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. కేంద్రంలోని మోదీ సర్కారు ఈ పరిశ్రమను అమ్మేందుకు మూడేండ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నది. మొదటిసారి స్క్రాప్ ఈ-వేలంలో భాగంగా 2022 మే 5న ఆన్‌లైన్‌లో బిడ్లను ఆహ్వానించింది. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా బీజేపీ మినహా అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఏర్పడి ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పట్లో వేలం ప్రక్రియ నిలిచిపోయింది. మరోసారి ఈ టెండర్లను కేంద్రం పిలిచింది. ఈ నెల 7 నుంచి టెండర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేసుకోవచ్చని సూచించింది. మూతబడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమలో 71 పరికరాలకు సంబంధించి వేలం ప్రారంభ ధర రూ.43.30 కోట్లు ఉంటుందని అధికారులు తెలియజేశారు. దీంతో జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యాటక రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

(మొదటి తరువాయి)

శాఖల ముందస్తు బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన టూరిజం పాలసీని తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న ఆలోచనకు అనుగుణంగానే బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని అధికారు లను ఆదేశించారు. టూరిజం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి వనరులు సమృద్ధిగా ఉన్నాయనీ, వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి అధికా రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎకో, మెడికల్- వెల్‌నెస్, టెంపుల్, ఆధ్యాత్మిక టూరిజం అభివృద్ధి కోసం పర్యటక శాఖ రూపొందించిన ప్రతి పాదనలకు అనుగుణంగా బడ్జెట్లో తగిన ప్రాధా న్యతను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేట్, భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో టూరిజం ప్రాజెక్టులను చేపట్టడానికి రాష్ట్రంలో చాలా మంది ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఈ పద్ధతిలో నడుస్తున్న టూరిజం ప్రాజెక్టుల నుంచి రావాల్సిన ఆదాయం ప్రభుత్వానికి రాని యెడల వాటిని సమీక్షించాలని సూచించారు. ప్రాజెక్టుల వారీగా సమీక్షించి ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడానికి కావలసిన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ చుట్టూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అటవీ, టూరిజం శాఖలు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. వర్క్‌ఫ్రం హోం పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను దృష్టిలో పెటుకుని కొత్త ప్రాజెక్టులను తీసుకురావాలని సూచించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న హరిత హౌటళ్ల నిర్వాహణ గురించి అడిగి తెలుసుకున్నారు. నష్టాల్లో నడుస్తున్న హౌటళ్ళను లాభాల బాటలోకి తీసుకురావడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ రామకృష్ణారావు, టూరిజం ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, కమర్షియల్ టాక్స్ కమిషనర్ సయ్యద్అలీ ముర్తుజా రిజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ టూరిజం డైరెక్టర్ హనుమంతు జెండగే తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాహిస్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది

## పులి పిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

(మొదటి తరువాయి)

జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ ర్గి÷నైరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

## శాసనసభకు కేసీఆర్ రాకపోవడంపై పిల్

(మొదటి తరువాయి)

అంశంపై పిల్ ఎలా వేస్తారని ప్రశ్నించింది. ఈ విషయంలో కోర్టులు ఎలా జోక్యం చేసుకోగలవని పిటిషనర్‌ను ప్రశ్నించింది. వివరణ ఇచ్చేందుకు పిటిషనర్ లాయర్ గడువు కోరడంతో విచారణ ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యేందుకు చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.విజరుపాల్‌రెడ్డి వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజరుపాల్, జస్టిస్ యారా రేణుకలతో కూడిన డివిజన్‌బెంచ్ మంగళవారం విచారించింది. పిటిషనర్ గడువు కోరడంతో విచారణ వచ్చే నెల రెండో వారానికి వాయిదా వేసింది.

## రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం

(మొదటి తరువాయి)

చేయిస్తున్నాయంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. తమ పార్మసీల నుంచి మందులు కొనుగోలు చేయాలంటూ.. రోగులను బలవంతం చేయకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. దీంతో రోగులు దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అయితే పిటిషనర్ వాదనతో సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే పార్మసీలో స్వల్ప ధరకు లభ్యమవుతుంటే.. దానిని తమ పార్మసీలోనే కొనుగోలు చేయాలంటూ ప్రైవేట్ ఆసుపత్రులు రోగులపై ఒత్తిడి తీసుకు రాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార మందులు అందుబాటు ధరల్లో లభించడం కష్టమై పోయిందంటూ వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడికి గురి కాకుండా రక్షించేందుకు తగిన మార్గ దర్శకాలను రూపొందించాలంటూ కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ఉక్రెయిన్ మిలటరీ సాయానికి ట్రంప్ బ్రేక్

(మొదటి తరువాయి)

స్పష్టం చేశారు. మన భాగస్వాములు కూడా ఈ లక్ష్యానికి కట్టుబడి వుండాల్సి వుంది. ఒక పరిష్కార మార్గానికి దోహదపడేలా ప్రస్తుతానికి మనమందించే సాయాన్ని నిలిపివేస్తూ,ఈ మొత్తం వ్యవహారంపై సమీక్ష జరుపుతున్నాం.” అని వైట్‌హౌస్ అధికారి ఒకరు వెల్లడించారు. యుద్ధం ముగిసే సమయం ఇంకా చాలా చాలా దూరంలో వుంది అంటూ జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ ట్రంప్, గతంలో అమెరికా అందించిన తోడ్పాటును ఉక్రెయిన్ కలకాలం గుర్తుంచుకోవాలని పునరుద్ఘాటించారు. 'జెలెన్‌స్కీ చేసిన అత్యంత అధ్వాన్నమైన ప్రకటన ఇది. అమెరికా దీర్ఘకాలం దీన్ని సహించలేదు.' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవాలనుకున్న ఖనిజాల ఒప్పందం కథ ఇక ముగిసినట్లేనని భావిస్తున్నారా అని ప్రశ్నించగా అలా అనుకోవడం లేదని ట్రంప్ బదులిచ్చారు.

## తెలుగు పంచాంగం 4/3/2025,మంగళవారం



సమయ సమాచారం:
సూర్యోదయం: ఉదయం 6:34
సూర్యాస్తమయం: సాయంత్రం 6:19
చంద్రోదయం: ఉదయం 10:11
చంద్రాస్తమయం: రాత్రి 11:45
తిథి:
షష్టి -మార్చి 5 మధ్యాహ్నం 1:39 వరకు
సప్తమి -మార్చి 5 మధ్యాహ్నం 1:39 నుండి మార్చి 6 మధ్యాహ్నం 12:23 వరకు
నక్షత్రం:
భరణి -మార్చి 5 ఉదయం 3:30 వరకు
కృత్తిక - మార్చి 5 ఉదయం 3:30 నుండి మార్చి 6 ఉదయం 2:44 వరకు
శుభ సమయాలు:
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:04 నుండి 12:51 వరకు
అమృత కాలం: మధ్యాహ్నం 12:58 నుండి 2:26 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:57 నుండి 5:46 వరకు
అశుభ సమయాలు:
రాహుకాలం: మధ్యాహ్నం 12:28 నుండి 1:56 వరకు
యమగండం: ఉదయం 8:02 నుండి 9:31 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 11:20 నుండి 12:08 వరకు, మధ్యాహ్నం 2:24 నుండి 3:12 వరకు
వర్జ్యం: రాత్రి 1:12 నుండి 2:39 వరకు


## దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 50 వేల రూపాయల విరాళం

-విరాళం అందజేయడం పట్ల మోత్కులగూడ గ్రామస్తుల హర్షం



**నందిగామ, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నందిగామ మండలం మోత్కులగూడ గ్రామంలో నూతనంగా ప్రతిష్టిస్తున్న దేవతామూర్తుల విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ రూ. 50,000 విరాళంగా అందజేశారు. ఇట్టి విరాళాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుల చేత అందజేశారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ట చేస్తున్న శ్రీ వీరాంజనేయ స్వామి, వినాయక విగ్రహ ప్రతిష్టాపనకు, ధ్వజస్తంభ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడం హర్షదాయకమని గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకు గ్రామంలోని దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు ఉంటాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. చివరి రెండు రోజులపాటు దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం, భజన కళాకారుల చేత భజన కీర్తనల ఆలాపన వంటి ప్రత్యేక దైవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములై స్వామి వారి తీర్థ ప్రసాదాలను పొందాలని కోరారు.

## ఈనెల 8న లయన్స్ జిల్లా కన్వెన్షన్



**హైదరాబాద్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 ఎ యొక్క వార్షిక సమావేశం ఈనెల 8వ తేదీన సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో జరుగుతుందని జిల్లా గవర్నర్ డి. కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ జీ. బాబురావు, విశిష్ట అతిథిగా పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఆర్. సునీల్ కుమార్, ఎల్.సి.ఐ.ఎఫ్. ఏరియా లీడర్ నరేందర్ రెడ్డి, గాట్ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్జీ, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ రాజిరెడ్డి, లయన్ తీగల మోహన్రావు తదితరులు పాల్గొంటారని చెప్పారు. అలాగే ఈ కార్యక్రమంలో 2025-26 సంవత్సరానికి కొత్త గవర్నర్‌ను ఎన్నుకునే కార్యక్రమం కూడా ఉంటుందని, ఈ సంవత్సరంలో మరణించిన లయన్ సభ్యులకు నివాళులర్పించే కార్యక్రమం నెక్రాలజీ ఉంటుందని తెలిపారు. క్లబ్ సభ్యులందరూ సకాలంలో చేరుకొని వారి క్లబ్‌ల బ్యానర్ ప్రజెంటేషన్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి. మహేంద్ర కుమార్ రెడ్డి, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ సురేష్ జగ్నాని, జిల్లా కేబినెట్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ,విద్యారంగ సమస్యలపై పోరాడుతాం!

-ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం!!
-ప్రభుత్వ బడి పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తాం!!!
-కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో టిపిటిఎఫ్ ను ఆదరించిన ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఉద్యమాభి వందనాలు టిపిటిఎఫ్ ....




**హైదరాబాద్,మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కరీంనగర్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో టిపిటిఎఫ్ ఆశయాలు, విధానాలతో ఏకీభవించి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన టి పి టి ఎఫ్ అభ్యర్థి వై.అశోక్ కుమార్ వైపు నిజాయితీగా నిలబడి మొదటి ప్రాధాన్యతా ఓట్లు వేసిన 2621 మంది ఉపాధ్యాయ అధ్యాపకులకు మరియు మద్దతుగా నిలిచిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలకు టిపిటిఎఫ్ పక్షాన ఉద్యమాభి వందనాలు రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్ అనిల్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంలో ఉంది. పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో, భౌతిక వనరులను అభివృద్ధి పరచడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నది. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి టి పి టి ఎఫ్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది నిధులను పరిశీలిస్తే విద్యారంగం పట్ల ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తుంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య దొరుకుతుందనే నమ్మకం ప్రజల్లో లేకుండాపోయింది. దీని ఫలితంగా ప్రైవేటు,కార్పోరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. విద్య మొత్తం ప్రభుత్వ ఆధీనంలో కొనసాగడానికి , విద్యార్థులకు నాణ్యమైన శాస్త్రీయమైన విద్య అందించుటకు, తరగతి గదిలో సమస్యలు లేని ఉపాధ్యాయుడిని నిలబెట్టుటకు, ఉపాధ్యాయుల మరియు విద్యారంగం పక్షాన నిలబడి టి పి టి ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలుపుతున్నాము. విద్యారంగంలో శరవేగంగా వస్తున్న ప్రైవేటీకరణ కార్పొరేటీకరణకు కు వ్యతిరేకంగా కలిసివచ్చే సంఘాలతో ఐక్య ఉద్యమాలను నిర్మిస్తాం. ప్రభుత్వం ఎన్నికలలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు, విద్యా రంగంలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దు, కేజీబీవీ టీచర్లకు రెగ్యులరైజేషన్, పర్యవేక్షణ పోస్టులలో టీచర్లకు ప్రమోషన్లు తదితర సమస్యలతో పాటు మాడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల, విద్యార్థుల సమస్యల పరిష్కారానికై, పెండింగు బిల్లుల,డీఏ ల విడుదలకు, పీఆర్సీ అమలుకు మెజారిటీ ఉపాధ్యాయుల మద్దతును కూడగట్టి ఉద్యమిస్తాం. ఇప్పటివరకు టీచర్లు అనుభవిస్తున్న సౌలభ్యాలన్నీ ఉద్యమాల ద్వారానే సాధించబడ్డాయనే వాస్తవాన్ని గ్రహించి, ఉపాధ్యాయ విద్యారంగ అపరిష్కృత సమస్యలకై ఉద్యమబాట పట్టాలని కోరుతున్నాము.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ



**దేవరకొండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గంలోని బాయ్స్ హాస్టల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మార్చి 5వ తేదీ నుంచి జరిగే వార్షిక పరీక్షలకు అవసరమైన పరీక్షా సామాగ్రిని (పరీక్ష ప్యాడ్, రెండు పెన్నులు, పౌచ్, స్కేల్) అందజేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, నల్ల శ్రీకాంత్ జాంభవ్ మాట్లాడుతూ, "విద్య ఒక్కటే మన జీవితాన్ని వెలుగులోకి తెచ్చే దీపం. విద్య మనకు జ్ఞానం మరియు సమర్థతను అందిస్తుంది. కేవలం చదవడం మాత్రమే కాకుండా, దానిని జీవితంలో ఎలా అన్వయించుకోవాలో నేర్పిస్తుంది. రాబోయే కాలంలో కాబోయే ఆఫీసర్స్ ఉన్నతమైన శిఖరాలకు ఎదగాలని, పరీక్షలను బాధ్యతతో రాయాలి కానీ భయంతో కాదు" అని అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ "ఆల్ ది బెస్ట్" తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ దేవరకొండ మండల అధ్యక్షులు రోహిత్, గణేష్, కిషోర్, నాగేష్, శివకుమార్, శేఖర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 31 చివరి నాటికి 25 శాతం రాయితీ తో ఎల్.ఆర్.ఎస్ చేయించుకొండి.

-ఎల్. ఆర్.ఎస్ లేని వారు మార్చి 31 తర్వాత ఇల్లు కట్టుకోవాలనుకుంటే ఎలాంటి రాయితీ లేకుండా ప్రస్తుత మార్కెట్ వాల్యూ కు 14 శాతం పెనాల్టీతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది
-కచ్చా లేఅవుట్, ప్లాట్ ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ సదవకాశాన్నికొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలి
-జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, మార్చ్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
మార్చి 31 నాటికి కచ్చా లే అవుట్ లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు . ఎల్.ఆర్.ఎస్ పై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం వనపర్తి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు జిల్లాలో 29 వేల మంది ఎల్.ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 38 మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఫోన్ నెంబర్లలో తేడాలు, చిరునామాల్లో తేడాలు ఉండటం వల్ల అవి ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి చేరడం లేదన్నారు. లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటు పై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తో పాటు 14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు , కుంట కింద లేకుంటే ప్లారు యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళు తుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్. తిరస్కరణకు గురి అయితే చెక్కించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదని అదేవిధంగా లే అవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ ద్వారా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్తులో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్.ఆర్ ఎస్ ఉన్న ప్లాటు కు మంచి డిమాండు ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానర్ లు ప్లాటు యజమానులతో సంప్రదించి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవిధంగా చూడాలని కోరారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లేఔట్ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల ఫీజు దోపిడిని అరికట్టాలి





**తుక్కుగూడ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్ఓ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో, రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్కూల్, కాలేజీ యజమాన్యాల ఫీజు దోపిడిని అరికట్టాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎం. లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. విద్యార్థులను వేధిస్తున్న కాలేజీ యజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను నారాయణ, శ్రీ చైతన్య లాంటి ప్రైవేట్ స్కూల్ మరియు కళాశాల యజమాన్యులు ఫీజు దోపిడీతో హాల్ టికెట్లు ఇవ్వకుండా తల్లిదండ్రులను మరియు విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, అన్ని కళాశాలలకు నోటీసులు పంపి, హాల్ టికెట్లు ఆపకుండా విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, శ్రీ చైతన్య, శ్రీ నారాయణ మరియు ఇతర కార్పొరేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే, భవిష్యత్తులో జరిగిన పరిణామాల కోసం పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులను కాపాడుతూ, వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర కమిటీ సభ్యులు రఘు ముదిరాజ్, సుధాకర్, సంపత్ మహేశ్వరం, శైలజ, సుకన్య, సబిత, రజిత, కవిత, సుజాత, మమత, కల్పన, సమీక్ష తదితరులు పాల్గొన్నారు.

## రజినీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సింగిరెడ్డి దంపతులు



**వనపర్తి, మార్చ్ 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సాయిచంద్ సతీమణి రజినీ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ లో తమ నివాసంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సింగిరెడ్డి వాసంతి దంపతులు ఆమెకు శుభాకాంక్షలు తెలియ జేసిన,ఎంతో ఆప్యాయంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు వెంట టిఆర్ఎస్ కార్యకర్తలు, సాయిచంద్ అభిమానులు ఉన్నారు.

## రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్,జిల్లెల చిన్నారెడ్డితో సర్పంచుల సంఘం జే.ఏ.సీ. ప్రతినిధుల భేటీ



**వనపర్తి,మార్చి 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** సర్పంచుల సంఘం రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటీలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలనువివరించారు సర్పంచుల సమస్యలపై స్పందించిన శ్రీ చిన్నారెడ్డివారి వినతి పత్రంపై ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఎండార్స్మెంట్ చేశారు.

## మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**గోపాలపేట, మార్చ్ 04( నీలగిరి ఎక్స్ ప్రెస్):** గోపాలపేట మండలం మున్ననూరు గ్రామానికి చెందిన రాములు,లక్ష్మిలకు మూడవ సంతానమైన ఒమేష్ కల్వకుర్తి మండలం జయప్రకాష్ నగర్ తాండ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు..శివరాత్రి రోజున వెల్దండ మండలంలోని ప్రసిద్ధ ఆలయమైన అంబా రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు వెళ్లి కోనేరులో స్నానం చేస్తూ మునిగి మృతి చెందాడు...విషయం తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మంగళవారం మున్ననూరు గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.విద్యార్థి తల్లిదండ్రులైన రాములు, లక్ష్మిలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.నలుగురు సంతానంలో మూడోవాడైన ఓమేష్ చదువులో మంచి ఉషారుగా ఉండేవాడని ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్చార్జ్ సత్యశీల రెడ్డి, గ్రామ నాయకులు సత్యం, ధిరమల్లు,రాజు, రాములు, గ్రామస్తులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గు ఉన్నత పాఠశాల అభివృద్ధికి 2001బ్యాచ్ పూర్వ విద్యార్థుల కృషి..

**-దేశ భవిష్యత్తును నిర్మించే తరగతి గదిని కాపాడుకుందాం..**



**కొందుర్గు, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కొందుర్గు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండు తరగతి గదుల్లో ఫ్లోరింగ్ రిపేరు కొరకు 2000-2001 పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఒక ట్రాక్టర్ డస్ట్, ఒక ట్రాక్టర్ కంకర, 10 సిమెంట్ సంచులు 8000 రూపాయలు పాఠశాలకు బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మనం ఓనమాలు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధి మన అందరి బాధ్యత అని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని అందరూ సహకరించినట్లయితే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, పటేల్ సతీష్ కుమార్, కాశ మల్లేష్, రమేష్, రవి, గోపి నర్సింలు,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

## మంచాల మండలంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**మంచాల, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మంచాల మండలం ఆగా పెల్లి గ్రామంలో అశ్వాల బాలరాజ్ ఆధ్వర్యంలో, సాధురం కంటి హాస్పటల్ దోమలగూడ వారు సంయుక్తంగా ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎస్. రెడ్డి, మంచాల మండల సహకార బ్యాంక్ చైర్మన్ శ్రీ హనుమంత రెడ్డి, సహకార బ్యాంక్ డైరెక్టర్ రమేష్, మంచాల మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ ఏర్పుల రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వాల జగను, అశ్వాల యాదగిరి, కంబాల పెల్లి సాయిలు, గోసుల యాదయ్య, భద్ర ముని నరసింహ, ముదిరాజ్ మొగలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. మొత్తం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 10 మందికి కంటి ఆపరేషన్ చేయాల్సిన అవసరమని గుర్తించారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# వ్యవసాయరంగం,రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదు

**-మాజీ మంత్రి సింగిరెడ్డి**



**వనపర్తి, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** వ్యవసాయరంగము, రైతులపట్ల ఈ ప్రభుత్వానికి బాధ్యత లేదు రైతులకు ఏమి జరిగినా వాళ్లకు బాధ లేదు అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం అన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించే పథకం రైతుబీమా .. రైతు చనిపోయిన ఏడు పనిదినాలలో రైతు కుటుంబానికి పరిహారం అందేది ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలలో ఒకటి రైతుబీమా, రైతుబంధు అని యూఎన్ఓ కు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ప్రకటించింది రైతు బీమా పథకం ప్రవేశపెట్టిన తరువాత డిసెంబర్ 4, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మరణించగా రూ.5,909.85 కోట్లు ఆ రైతు కుటుంబాలకు పరిహారంగా అందించడం జరిగింది రైతుబీమా పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6122.65 కోట్లు ఎల్ఐసీ కి ప్రీమియంగా చెల్లించింది ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేల పై చిలుకు కుటుంబాల పరిహారం పెండింగులో ఉన్నాయి440కి పైగా రైతులు 15 నెలల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు కరంటు రాదు, నీళ్లు రావు, రైతుబంధు రాదు, రైతుభీమా ప్రీమియం చెల్లించరు .. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిస్తున్నది ? కాంగ్రెస్అభయహస్తంలో వ్యవసాయానికి రూ.3 లక్షల వడ్డీ లేని రుణం అన్నారు. 24 గంటల కరంటు అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ మొదలే పెట్టలేదు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ఖాళీలను భర్తీ చేయలేదు. అసైన్డ్ పోడు భూములకు పట్టాభూములతో సమానంగా పరిహారం అని దాని ఊసెత్తడం లేదు ప్రభుత్వభూములను కుదువపెట్టి రైతుభరోసా కోసం అని రూ.10 వేల కోట్లు తెచ్చి రెండు నెలలు అవుతుంది .. మూడెకరాల వరకు రైతులకు కూడా రైతుభరోసా నిధులు పడలేదు మూడెకరాల వరకు రైతుభరోసా ఇచ్చామని వ్యవసాయ మంత్రి చెబుతుంటే .. మూడెకరాల వరకు రైతులకు డబ్బులు వేయాలని ఉప ముఖ్యమంత్రి చెబుతున్నారు పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతుభీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వానికి ఎందుకు మనసు రావడం లేదు ?ఇది రైతు అనుకూల ప్రభుత్వమా రైతుబీమాను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుంది రైతులు కష్టపడి పంటలు పండిస్తుంటే సాగునీళ్లు లేక, కరంటు లేక రైతుల పొలాలు ఎండుతున్నాయి .. పశువులకు మేతగా మారుతున్నాయి రాష్ట్రంలో అనేక సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు యాసంగి సీజన్ మొదలయ్యే సమయానికి దాని మీద సమీక్ష చేయడంలో ప్రభుత్వం విఫలమయింది రాష్ట్ర ప్రభుత్వ అన్ని వైఫల్యాలకు కారణం కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుంది రైతులు పంటలు వేసుకున్న తర్వాత రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో రైతులు పంటలు వేసుకోవద్దు అని చెప్పించారు ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖా మంత్రి చెప్పకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారితో సాగునీళ్లకు కొరత లేదని చెప్పించారు మరి నీటికి, కరంటుకు సమస్య లేకుంటే రైతులు దేనికి ఆందోళన చెందుతున్నట్లు ? ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు ? ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్ శాఖా మంత్రులు ధైర్యం ఉంటే పంటలు ఎండుతున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి రైతులను కలవాలి రాష్ట్రంలో ఎక్కడా పంటలు ఎండడం లేదని ధైర్యం ఉంటే ప్రభుత్వం ప్రకటించాలి కష్టపడి సాగు చేసే రైతులు తమ పంటలను ఊరికెనే పశువులకు వదిలేస్తారా ?రోజూ అబద్దాలతో కూడిన రాజకీయాలు చేయడం తప్ప ప్రభుత్వానిక ఏమీ పట్టడం లేదు రాష్ట్ర జనాభాలో 50 నుండి 60 శాతం ఉండే రైతులు, రైతుకూలీలు, దాని అనుబంధ రకాల ప్రజలు జీవించే వ్యవసాయరంగం గురించి పట్టించుకోకుంటే ఈ ప్రభుత్వం దేని గురించి పట్టించుకుంటుంది రాష్ట్రంలో పుష్కలంగా నీళ్లు, వర్షాలు ఉన్నా దానిని నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైంది కరంటు, సాగునీటి కష్టాల కారణంగా రైతుభరోసా ఇవ్వని కారణంగా రైతులు రాష్ట్రంలో ఆందోళనలో ఉన్నారు. ఆత్మహత్యలుచేసుకుంటున్నారు మంత్రులు రైతుల వద్దకు వెళ్లి భరోసా కల్పించాలి .. ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం కల్పించాలి తుంగతుర్తి, సూర్యాపేటలకు 300 కిలోమీటర్ల దూరం కాళేశ్వరం నీళ్లను తీసుకువచ్చి బీఆర్ఎస్ హయాంలో పంటలు పండించారు గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది వ్యవసాయరంగాన్ని ఎంతో బాధ్యతతో కేసీఆర్ పాలనలో ముందుకు తీసుకెళ్లాం రైతాంగం బాధలను దిగమింగాలి కానీ ఆత్మహత్యలకు పాల్పడవద్దని వేడుకుంటున్నాం .. మిమ్మల్ని మీరు శిక్షించుకోవద్దని ముకుళిత హస్తాలతో కోరుతున్నాం .. ప్రాధేయపడుతున్నాం .. వేచి ఉండండి .. సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వాన్ని శిక్షించండి ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల, వ్యవసాయం పట్ల బాధ్యత లేదు .. బాధ లేదు రైతు, వ్యవసాయ అనుకూల విధానాలు, పథకాల అమల్లో కాంగ్రెస్ విఫలం వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామని రాహుల్ సమక్షంలో ప్రకటించిన కాంగ్రెస్ దానిని అమలు చేయకుండా మోసం చేస్తుందిని తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిఅన్నారు హాజరైన మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

# భారతదేశం ఔషధ మొక్కలకు పుట్టినిల్లు

**- డాక్టర్.చంద్రశేఖర్ శర్మ**




**కద్దాల్,మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వారి ది ఎర్త్ సెంటర్ నీ ప్రకృతి ఒడిలో ఒక రోజు అనే కార్యక్రమాల్లో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాల రావిరాల విద్యార్థులు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ శర్మ గారు ఆయుర్వేదిక్ ఫిజిషియన్ గర్వపత్య చికితలయం బెంగుళూరు, శంకర గురుకుల ఫౌండర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశం అనాది కాలం నుండి ఔషధ మొక్కలకు పుట్టినిల్లని, ఔషధ మొక్కల యొక్క ఔనత్యాన్ని మరియు ఉపయోగాన్ని, ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి నిత్యా జీవన విధానంలో భాగం చేసుకోవాలని సూచింతచారు.కార్యక్రమంలో భాగంగా సిజిఆర్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ కొర్పోలు లక్ష్మారెడ్డి గారు మట్లాడుతూ ఆయుర్వేదం పుట్టిన దేశం భారతదేశమని ప్రపంచ దేశాలకు ఆయుర్వేద ప్రాముఖ్యతను చాటి చెప్పిందని, ప్రతి ఒక్కరు ఔషధ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకొని ఇంట్లో పెంచుకొని, మన ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన అవశ్యకత అందరిపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ మాధవ రెడ్డి గారు మరియు ఉపాధ్యాయులు శేఖర్, జగదీష్, సిజిఆర్ ప్రతినిదులు జ్ఞానేశ్వర్, నాగేష్, రజనికాంత్, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నిక ఏదైనా గెలుపు బిజెపిదే

-అన్ని రంగాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుండు సున్నానే

-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి




**షాద్ నగర్, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో ఎన్నిక ఏదైనా గెలుపు బిజెపిదే అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయ దుందుబీ మ్రోగించిన మల్క కొమురయ్య గారు విజయం సాధించిన సందర్భంగా షాద్ నగర్ ముఖ్యకూడలిలో బిజెపి పట్టణ అధ్యక్షులు హరిభూషణ్ పటేల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి గారు, అందె బాబయ్య గారు పాల్గొనడం జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాదాన్యత ఓట్లతోనే విజయం సాధించిన మల్క కొమురయ్య గారికి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరిస్తే ప్రజలు ఆదరిస్తారు కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టి ఫలితాలు ఇలానే ఉంటాయని అన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కూడా బిజెపి అభ్యర్థి అంజిరెడ్డి గారు కూడ భారీ మెజారిటీ తో గెలువబోతున్నారని అన్నారు. అందె బాబయ్య మాట్లాడుతూ, వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్ కు ఇలానే బుద్ధి చెబుతారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పని చేసి బిజెపి అభ్యర్తులను గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు, కొత్తూరు మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపూర్ మహేందర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చెట్ల వెంకటేష్, మల్చలం మురళి, సుధాకర్ అప్ప, బాల్ రెడ్డి, నర్సింలు, కుడుముల బాలరాజ్, రంగన్న గౌడ్, రాము, గట్టొజీ విజయ్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు = అమ్మ
## చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే సైన్స్ ఫేర్





-జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప







**ఆమనగల్లు, మార్చి 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
"విద్యార్థుల్లో పరిశోధనా మనోభావాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఫేర్‌లాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి" అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప పేర్కొన్నారు. పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో కలిసి ఫేర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు, కమిషనర్ శంకర్ నాయక్, ట్రస్మా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన 100 ప్రాజెక్టులు ఫేర్‌లో ప్రదర్శించబడగా, అందులోని వినూత్న ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

**విద్యార్థుల్లో సృజనాత్మకతకు వేదిక**
ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప మాట్లాడుతూ,
"ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. శాస్త్రీయ ఆలోచనకు పునాది వేసే ఈ ఫేర్లు, కొత్త ఆవిష్కరణలకు దోహదం చేస్తాయి," అని పేర్కొన్నారు.
టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ,
"విద్యార్థులు పుస్తకాల పరిధిని దాటి ప్రయోగాత్మకంగా ఆలోచించేలా ప్రేరేపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరం. భవిష్యత్తులో వారు సాంకేతిక రంగంలో ముందుకు వెళ్లేందుకు ఇవి మేలైన బాటవేస్తాయి," అని అభిప్రాయపడ్డారు.

**మనోవికాసానికి సైన్స్ ఫేర్లు కీలకం**
పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు మాట్లాడుతూ,
"ప్రాక్టికల్ లెర్నింగ్‌కు సైన్స్ ఫేర్లు మేలైన వేదిక. విద్యార్థుల మనోవికాసానికి, ఆలోచనా శక్తి పెంపొందించేందుకు ఇవి ఉపకరిస్తాయి," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమూద్,ట్రస్మా సభ్యులు చుక్క అల్లాజీ గౌడ్, ఏ. శ్రీరామ్, శివలింగం, సుధీర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అవ్వారి నిరంజన్, కోట్ల వెంకటేష్, సంజీవ్ కుమార్, శ్రీనివాసులు, వెంకన్న, అకాడమిక్ అడ్వైజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు మల్లేష్, కరుణాకర్, విజేందర్, అజర్, స్వప్న, అరుణ, మీనా, స్వాతి, రత్నకుమారి, సుస్మిత, ధనలక్ష్మీ తదితరులు విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సైన్స్ ఫేర్ విద్యార్థుల్లో పరిశోధనా ధోరణిని, విశ్లేషణాత్మక ఆలోచనలను ప్రేరేపిస్తూ, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. "భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి, యువతలో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించాలి" అని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

## చించోడు గ్రామంలో సిసి కెమెరాలు ప్రారంభించిన షాద్ నగర్ ఏసిపి రంగస్వామి.

-గ్రామస్తులను అభినందించిన ఎసిపి




**షాద్ నగర్, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీసు వారి సూచన మేరకు చించోడ్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు సిసి కెమెరాలు ప్రారంభించిన షాద్ నగర్ ఏసిపి రంగస్వామి ఫరక్ నగర్ మండలం, చించోడ్ గ్రామంలో సీసీ కెమెరాలు ను ఏసిపి రంగస్వామి ప్రారంభించారు.ఇట్టి ప్రారంభోత్సంలో పట్టణ సీఐ విజయ్ కుమార్ మరియు సిబ్బంది,స్థానిక నాయకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలి.ఇప్పటికే చించోడ్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేదం నడుస్తున్నది.సీసీ కెమెరాల ఏర్పాటు విశయంలో చించోడే గ్రామంను ఇతర గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

## అన్నారం గ్రామంలో వికలాంగుల సంఘం సంతకాల సేకరణ



**వంగూరు, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వంగూరు మండల పరిధిలోని అన్నారం గ్రామంలో మంగళవారం ఎన్ పి ఆర్ డి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలేశ్వర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సంతకాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.

# హైదరాబాద్ మేధా పాట్కర్ పర్యటన

– మూసీ పునరుద్ధరణ పై వ్యవసాయ కమిషన్ తో కీలక చర్చలు



**హైదరాబాద్, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో ప్రముఖ సామాజిక పర్యావరణవేత్త మేధా పాట్కర్ హైదరాబాదులో పర్యటించి, రెండురోజుల పాటు మూసీ నది పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా, మూసీ పునరుద్ధరణకు కారణంగా ఇల్లు కోల్పోయిన కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను సమీక్షించారు. ఈ రోజు బి.ఆర్.కె భవన్ లో జరిగిన సమావేశంలో, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవాని రెడ్డి, గడుగు గంగాధర్ లతో మేధా పాట్కర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టు వల్ల ఇల్లు కోల్పోయిన ప్రజలు, వ్యవసాయ భూములు కోల్పోయిన రైతుల సమస్యలపై మేధా పాట్కర్ చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని కమిషన్ సభ్యులు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పథకాలు అమలు చేస్తూ, రైతుల కోసం రెండు లక్షల రూపాయల రుణమాఫీ, రూ. 500 బోనస్, రైతు భరోసా వంటి కార్యక్రమాలను తీసుకువచ్చారని వివరించారు. మూసీ ప్రాజెక్టు పరిధిలో ఇల్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, వ్యవసాయ భూములకు బదులుగా భూమి కేటాయింపు వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మేధా పాట్కర్ ప్రజల పునరావాసంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మూసీ నది పూర్వ వైభవం తీసుకురావడానికి, మూసీ పరివాహక ప్రాంత ప్రజల అభిప్రాయాలతో పాటు చర్యలు చేపట్టాలని పునరుద్ధరణ ప్రాజెక్టు నిర్వహణలో పారదర్శకతను పాటించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

## కమ్మదనం గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**షాద్ నగర్, మార్చ్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని కమ్మదనం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఆకస్మిక తనిఖీలో భాగంగా భోజనశాలను సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నందుకు ప్రిన్సిపాల్ ని మరియు సిబ్బందిని అభినందించారు. విద్యార్థుల వసతి గృహాలను, బాత్రూంలను పరిశీలించడం జరిగింది. హాస్టల్ మెస్ కి కావాల్సిన స్టీమ్ కుకింగ్ రిపేర్ కి మరియు కూలిన ప్రహరీ గోడని తిరిగి కట్టించాలని స్థానిక తాసిల్దార్ సూచించడం జరిగింది. భోజనశాల చాలా పరిశుభ్రంగా ఉందనీ పాత్రలన్నీ కూడా పరిశుభ్రంగా ఉన్నాయని మెను సక్రమంగా ఫాలో అవుతున్నారని
మెస్ ఇంచార్జ్ కేర్ టేకర్ శివజ్యోతిని అభినందించారు. కలెక్టర్ పాఠశాలకి రావడం చాలా సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ కే. విద్యుల్లత సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పూల కుండీని బహూకరించారు..

## మృతురాలి కుటుంబానికి మట్ట వెంకటయ్య పరామర్శ



**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రనికి చెందిన సాయమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ పరామర్శించి, బాధిత కుటుంబానికి రూ. 5000 ఆర్థిక సాయం అందించారు. అలాగే, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుద్దటి కిష్టాలు, కొయ్యల పుల్లయ్య, దాసరి మహేష్, సిమ్మల తిరుపతిరెడ్డి, గంగ పొగు సాయిబాబా, ఆలూరు డేవిడ్, పెంటయ్య, జగన్, మంగళగిరి సత్యం, బచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై రాజకీయాలు చేయడం తగదు

**-కాయితి విజయ్ కుమార్ రెడ్డి**

**కల్వకుర్తి, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదాన్ని రాజకీయ రాజకీయం చేయడం తగదని అన్నారు. ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులను బయటకు తీసుకురావడానికి 11 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్‌ను అనుక్షణం మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమీక్షిస్తున్నారని తెలిపారు. విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బాధ్యతగా పనులు నిర్వహిస్తుంటే, ప్రతిపక్షాలు మాత్రం ప్రభుత్వం పైన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో ఎక్కడైనా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఇంత బాధ్యతగా వ్యవహరించిన ప్రభుత్వం లేదని, బాధ్యతగా వ్యవహరించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని వివరించారు.

ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలను అండగా నిలవాల్సిన సమయంలో, ఇలాంటి చౌకబారిన మాటలు మాట్లాడడం సమంజసమని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే బదులు, దుమ్మెత్తి పోయడం సరైన పద్ధతి కాదని ఘాటుగా విమర్శించారు.

## అలరించిన సైన్స్ ఫెయిర్

**జన్నారం, ఫిబ్రవరి 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జన్నారం మండల కేంద్రంలో గల రాఘవేంద్ర బ్రదర్స్ వారి లిటిల్ హాంస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము తయారుచేసిన వస్తువులను ప్రదర్శించి ఆ వస్తువులను ఎలా తయారు చేశారు. అవి ఎలా ఉపయోగపడతాయనే విషయాన్ని చక్కగా ప్రయోగాత్మకంగా వర్ణించారు. వారు తయారు చేసిన వస్తువులు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, రాఘవేంద్ర బ్రదర్స్ ఎర్ర చంద్రశేఖర్, నరేష్, సంపత్, మహేష్ పాల్గొన్నారు.

# డీబీసీడీఓ ఆకస్మిక తనిఖీ

**- విద్యార్థుల పరిస్థితిపై సమీక్ష**

**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి (డీబీసీడీఓ) కాజా నిజాం అలీ అప్సర్ వెల్దండ మండలంలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహాన్ని రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా, బీసీ హాస్టల్ వార్డెన్ రామకృష్ణతో విద్యార్థుల హాజరు, మెను, ఆరోగ్య పరిస్థితులు, పరీక్షల సన్నాహాలు వంటి అంశాలపై చర్చించారు. విద్యార్థుల వివరాలు, మెను అమలు విధానాలు, పరీక్ష సమయంలో అనుసరించవలసిన నిబంధనలపై అవగాహన కల్పించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని వార్డెన్‌ను ఆదేశించారు. డీబీసీడీఓ విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడి, విద్యాబోధన మరియు పుస్తకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మెను ప్రకారం సరైన ఆహారం అందేలా చూడాలని, అలాగే వారి ఆరోగ్య సమస్యలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా అధికారి రాత్రి హాస్టల్‌లోనే బస చేసి, విద్యార్థుల దినచర్యను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో నరసింహ, పంచాయతీ కార్యదర్శులు మహేష్, హరికృష్ణ, ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## జాతీయ యువజన అవార్డుకు ఎంపికైన శివ కుమార్





भारत सरकार
युवा कार्यक्रम और खेल मंत्रालय
शास्त्री भवन, नई दिल्ली-110 001
GOVERNMENT OF INDIA
MINISTRY OF YOUTH AFFAIRS & SPORTS
SHASTRI BHAWAN, NEW DELHI-110 001

Madhavi Mohan
Deputy Secretary (NPYAD)
Tel:. 011-23073508

D.O. No. I-12012/4/2023-NPYAD
Dated the 3rd March, 2025

Dear Sh. G. Shiva Kumar,

I am glad to inform you that the Ministry of Youth Affairs and Sports has selected you for the **National Youth Award 2022-23**. The prestigious Award Presentation Ceremony will be held during the National Youth Parliament Festival. The details of date and venue will be communicated to you through E-mail.

2. This Ministry will arrange accommodation at the venue on twin sharing basis. The Ministry will not bear any expenditure in respect of guests accompanied with the awardees. However, differently abled awardees are entitled to travel along with an escort.

3. Out station awardees will be entitled for to-and-fro train fare by Second AC. Escorts accompanying the differently abled awardees, if any, will also be given TA/DA at par with the awardees. Travelling Allowances will be reimbursed by this Ministry on presentation of original tickets for to-and-fro journey. An intimation about your travel plan may kindly be informed to this Ministry through e-mail at ID mentioned below, so that necessary logistics can be arranged. You are requested to bring one set of formal dress/Saree or traditional attire which will be required to be worn while receiving the award.

4. The awardees from North Eastern States are entitled to travel by air and are requested to get their tickets only from authorized agencies namely, Balmer & Lawrie Limited, Ashoka Travels and IRCTC, failing which no reimbursement will be made. For reimbursement of TA/DA, you have to submit boarding pass (in original) of to and fro journey and copy of ticket of the journey performed along with completely filled TA form (copy enclosed). The Ministry will make arrangements for the boarding and lodging. Local transport at the venue for attending the ceremony will also be provided.

5. You are requested to send recent passport size photograph and one ID proof (the same must be carried) by e mail to this Ministry urgently. Also, all necessary information including your Aadhaar No. and Bank Mandate Form of your Aadhaar linked account may kindly be furnished by e-mail to npyad-moyas@gov.in.

6. For any further information, you may contact NPYAD Section @ 011-23386898.

7. I take this opportunity to extend hearty congratulations to you on behalf of the Ministry for having been selected for this prestigious Award.

With regards,

Yours Sincerely,
(Madhavi Mohan)

Shri Gudlanaram Shiva Kumar
H No 6 Dash 113 Gandhinaga
Kalwakurthy Vill Mandal, Nagarkurnool
Dist, Telangana, Pincode 509324

**కల్వకుర్తి, మార్చ్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన గుడ్లనరం శివ కుమార్, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అందించే అత్యుత్తమ యువ పురస్కారం "నేషనల్ యూత్ అవార్డు" కు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఢిల్లీలో జరిగే జాతీయ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో, దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా అందజేయనున్నారు. శివ కుమార్ చిన్న వయసు నుంచే స్వామి వివేకానంద సేవా బృందం పేరిట 13 సంవత్సరాలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలు, అవయవ ధానం ద్వారా ఆదర్శంగా నిలిచిన తీరు, రైతుల కోసం సోషల్ మీడియాలో చేస్తున్న కృషికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా, శివ కుమార్ మాట్లాడుతూ, నేషనల్ యూత్ అవార్డును ఆదర్శంగా భావించి రానున్న రోజుల్లో సమాజంలో యువతకు ఆదర్శంగా, పేద ప్రజలకు అండగా, పర్యావరణ పరిరక్షణపై, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరిన్ని మంచి పనులు చేస్తానని తెలిపారు. శివ కుమార్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల కుటుంబ సభ్యులు మరియు పలువురు అభినందనలు తెలియజేశారు.

## ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన శోభారాణి





మా

**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్మాణాధికారి శోభారాణి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు హాజరు రిజిష్టర్లను పరిశీలించారు అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య రాకుండ ము%శీ%దస్తుచర్యలు తీసుకొవాలని 2025 -26 సంవత్సరం చేపట్టే జీపీడీపీ గ్రామ పంచాయతీ మరియు బీపీడీపీ మండల యాక్షన్ ప్లాన్ తయారీ గురించి వివరించారు. అనంతరం నాగారం గ్రామ పంచాయతీలో నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం తీరును నర్సరీల అభివృద్ధిని పరిశీలించారు క్రమం తప్పకుండా మొక్కలకు నీరు అందించాలన్నారు . ఆమె వెంట ఎంపీడీఓ డి. జితేందర్ రెడ్డి, ఎంపీవో కేదార్ ఈశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ సందీప్ రెడ్డి కార్యాలయ పర్యవేక్షకులు,వివిధ శాఖల అధికారులు కార్యాలయ సిబ్బంది,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అమ్మవారి అభిషేకంలో పాల్గొన్న భక్తులు



**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



వెల్దండ మండల కేంద్రంలోని గుండాల గ్రామంలో శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజున శుద్ధ పంచమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించగా, భక్తులు అనేక ప్రాంతాల నుండి విచ్చేసి పాల్గొన్నారు. మహిళలు సహస్రనామ కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామివారి, అమ్మవారి దర్శనం పొందిన తర్వాత తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, దేవాలయం ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదనంగా, ఈరోజు రాత్రి రెండు గంటలకు జరుగబోయే పెద్దతేరు మహోత్సవానికి గ్రామ మరియు మండల ప్రజలందరూ భారీగా హాజరై, విజయవంతం చేయాలని దేవస్థానం ఈవో ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## కోనేరులో గ్రిల్స్ అమర్చేందుకు దాతలు సహకరించాలి

**వెల్దండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



వెల్దండ మండల కేంద్రంలోని గుండాల గ్రామంలో శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా అనుకోని సంఘటన చోటుచేసుకుంది. వనపర్తి జిల్లా గోపాలపేట మండల పరిధిలోని మున్నూరు గ్రామానికి చెందిన ఓమేష్ అనే విద్యార్థి, శివరాత్రి రోజున కోనేరులో స్నానం చేస్తుండగా ఈత రాక గల్లంతయ్యాడు.
ఈ ఘటనకు సంబంధించి, గ్రామ పెద్దలు, భక్తులు గమనించి గుడి సమీపంలో ఉన్న సొరంగ మార్గాలను పరిశీలించారు. కొందరు ఇది తమ పూర్వీకుల కాలంలో కూడా చూడని వినూత్న మార్గాలని, వింతగా భావించారు. దేవస్థానం కమిటీ ముందు జాగ్రత్తగా కోనేరు చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా గ్రామస్తులను, భక్తులను తోచినంత ఆర్థిక సాయం అందించాలని కోరుతూ దేవాలయ కమిటీ ఈవో ప్రసాద్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన భక్తుల దృష్టిని ఆకర్షించి ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఇది భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా తప్పించడానికి ఒక ప్రయత్నమని తెలిపారు.

## ఊరుకొండ మండలంలో నర్సరీ సందర్శన మరియు సమీక్ష



**ఊరుకొండ, మార్చి 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఊరుకొండ మండల పరిధిలోని బాల్య లోక్య తాండా మరియు జగబోయినపల్లి గ్రామాల నర్సరీలను సందర్శించి, నాణ్యమైన విత్తనాలు ఉపయోగించడం ద్వారా మాత్రమే మొలకలు బాగా వస్తాయని, లక్ష్యానికి అనుగుణంగా నర్సరీ నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు. బాల్య లోక్య తాండాలో డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అందించిన లిస్టు ప్రకారం ఇంటింటి సర్వే చేసి వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగింది. జగబోయినపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల మరియు అంగనవాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన విధానం, అందిస్తున్న భోజనం వివరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేందుకు ప్రధానోపాధ్యాయునికి మరియు అంగనవాడీ టీచర్‌కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, ఏపీవో నరసింహ, పంచాయతీ కార్యదర్శులు మహేష్, హరికృష్ణ, ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మరియు ఊరుకొండ ఎంపీడీవో పాల్గొన్నారు.